
సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 15 । అక్టోబర్ । 2024



మృత్యు కాలువ

ఆఫ్‌షోర్ కాలువ ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. హెచ్చరిక బోర్డులు కూడా లేవు.

- 8లో



సరికొత్త పంథాలో..

నేటి నుంచి ఇంటర్ క్వార్టర్లీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. కొత్త పంథాలో పరీక్షలు నిర్వహించనున్నారు.

- 8లో



బాలింతలే టార్గెట్

కొత్తూరులో బాలింతలే టార్గెట్‌గా మోసాలకు పాల్పడుతున్నారు. డబ్బులు వేస్తామని ఖాతా నంబర్లు అడుగుతున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం)లో అందిన అర్జీదారుల సమస్యలను వేగంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణ అధికారి, శ్రీధర్ రాజు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ లక్ష్మణ మూర్తి, డీపీఓ కె.భారతీసౌజన్య, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ బి.మీనాక్షి, జిల్లా ఉద్యాన అధికారి ఆర్‌పీ ప్రసాద రావు, బీసీ కార్పొరేషన్ ఈడీ గెడ్డెమ్మ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతి శ్రీ, డ్వామా పీడీ బి.సుధాకర్ రావు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కల్యాణబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 50 వినతులు



యువతి సమస్య వింటున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : మీకోసం ఫిర్యాదుల పరిష్కారంలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు 50 వినతులు అందాయి. ఎస్పీ ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సౌత్‌జోన్ నేషనల్స్‌కు జిల్లా అథ్లెట్స్

శ్రీకాకుళం న్యూకాలనీ: సౌత్‌జోన్ నేషనల్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2024 పోటీలకు శ్రీకాకుళం జిల్లా నుంచి రికార్డుస్థాయిలో తొమ్మిది మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ పోటీలు ఈనెల 16 నుంచి గుంటూరు వేదికగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేదికగా జరగనున్నాయి. జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులంతా ఈ నెల 16వ తేదీన ఉదయం 8 గంటలకు పోటీలు జరిగే మైదానం వేదిక వద్ద రిపోర్ట్ చేయాలని శ్రీకాకుళం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ కొన్న వెంకటేశ్వరరావు(వాసు), అధ్యక్షుడు కొన్న మధుసూదన రావు, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబ మూర్తి తెలిపారు.

ఎంపికైంది వీరే:

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా నుంచి వి.రాజేష్ (400 మీటర్ల పరుగు), టి.తరుణ్ (జావెలిన్‌త్రో), బి.హారిక (100 మీటర్ల పరుగు), కె.యాదగిరి (జావెలిన్‌త్రో), మౌనిక మిశ్ర (లాంగ్‌జంప్), పి.అశోక్ (హైజంప్), ఎం.రుషికుమార్ (జావెలిన్‌త్రో), పి.యశ్విత (హైజంప్), జి.అభిరామ్ (పెంటాథ్లిన్) ఎంపికైనవారిలో ఉన్నారు. వీరంతా ఈనెల 5 నుంచి 7 వరకు రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించడంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యారు.

కాంట్రాక్టు లెక్చరర్ల వినూత్న నిరసన



పసుపు రిబ్బన్లు తగిలించి విధులకు హాజరైన కాంట్రాక్ట్ లెక్చరర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఎన్నికల కోడ్ వల్ల ఆఖరి నిమిషంలో నిలిచిపోయిన తమ క్రమబద్ధీకరణ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని కోరుతూ కాంట్రాక్టు లెక్చరర్లు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వ పెద్దల దృష్టికి తమ సమస్యల్ని తీసుకుని వెళ్లేందుకు దశల వారీగా రాష్ట్ర వ్యాప్తంగా పలు రకాల ప్రదర్శనలు చేపట్టేందుకు నిర్ణయించారు. 24 ఏళ్లుగా పనిచేస్తున్న తమ సర్వీసులను రెగ్యులర్ చేసేందుకు ఉద్దేశించిన యాక్ట్ 30, జీఓ నంబర్ 114లను తక్షణమే అమలు చేయాలని కోరుతూ జిల్యావ్యాప్తంగా అనేక ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సోమవారం శాంతియుతంగా నిరసన చేపట్టారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించేలా పసుపు రంగు రిబ్బన్లు ధ రించి కళాశాల విధులకు హాజరయ్యారు. రాష్ట్ర నాయకత్వ పిలుపు మేరకు జిల్లాలోని కాంట్రాక్ట్ లెక్చరర్లు నిరసన చేపట్టారు. ప్రభుత్వ ఉన్నతాధికారులకు సమాచారాన్ని చేసేవేసేలా వినతిపత్రాలను ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లకు అందజేశారు. క్రమబద్ధీకరణ ప్రక్రియ దాదాపు పూర్తి కావచ్చిందని, చిన్న చిన్న సాంకేతిక కారణాలు, ఎలక్షన్ కోడ్ అడ్డంకులు వల్ల ఆగిపోయిన ఫైల్‌పై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అయినప్పటికీ ఎలాంటి స్పందన రాకపోతే సత్యాగ్రహ దీక్షకు సైతం కార్యాచరణ రూపొందించినట్లు జిల్లా జేఏసీ నాయకులు చెబుతున్నారు.

అంబేడ్కర్ ఆడిటోరియంలో డ్రా కోసంఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు





● టెండర్లలో పచ్చమార్క్

నేతల బంధువులకే కిక్కు

- దుకాణాల కోసం పోటీ పడిన మహిళలు
- 24 మంది నారీమణులకు దక్కిన దుకాణాలు
- మంత్రి అచ్చెన్న బంధువుకు మూడు
- 'సోదరుడి' అనుచరులకు భారీగా షాపులు
- నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఫ్యామిలీకి ఐదు
- షాపులు దక్కించుకున్న వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు, తటస్తులకు అప్పుడే బెదిరింపులు



డ్రా తీసి టోకెన్ చూపిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

మద్యం దుకాణాల లాటరీలో సిండికేట్లకు అసలైన కిక్కు దక్కింది. టీడీపీ నేతల ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ సిండికేట్లకే మూడింతలకు పైగా దుకాణాలు వచ్చాయి. టెక్కలి, నరసన్నపేట,ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, ఎచ్చెర్ల, ఆమదాలవలస నియోజకవర్గాల్లో తెలుగు తమ్ముళ్ల హవా కనిపించింది. దుకాణాల కోసం మహిళలు కూడా పెద్ద ఎత్తున పోటీ పడ్డారు. 24 మందికి లాటరీలో దుకాణాలు దక్కాయి. దుకాణాలు దక్కించుకున్న వారిలో మంత్రి అచ్చెన్నాయుడు బంధువు ఉన్నారు. 'సోదరుడి' అనుచరులు ఎక్కువ మంది ఉన్నారు. నరసన్నపేటలో ఎమ్మెల్యే బగ్గ రమణమూర్తి అనుకున్నది సాధించారు. తన కుటుంబికులకు ఏకంగా ఐదు దుకాణాలను సాధించుకున్నారు. లిక్కర్ బిజినెస్‌లోకి తొలిసారిగా జనసేన నేత, ప్రముఖ వైద్యుడు దానేటి శ్రీధర్ ఫ్యామిలీ ప్రవేశించింది. మరోవైపు కానివారికి దక్కిన దుకాణాలపై కూడా టీడీపీ కీలక నేతలు కన్నేశారు. వాటాలిస్తారా? గుడ్‌విల్‌కు వదిలేస్తారా? అంటూ ఫోన్‌లో సతాయింపు మొదలెట్టారు.

● హై'డ్రా'మా



దరఖాస్తుదారుని పత్రాలు చూతున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : స్థానిక ఆర్ట్సుకళాశాల రోడ్డులో సోమవారం చక్కటి హైడ్రామా నడిచింది. అంబేడ్కర్ ఆడిటోరియంలో మద్యం షాపుల లాటరీ తీయడంతో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 4671 మంది దరఖాస్తుదారులు, అనుచరులతో కోలాహలంగా కనిపించింది. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సమక్షంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ దోసకాయల శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో డ్రా ప్రక్రియ సజావుగా ముగిసింది.

అక్కడక్కడా..

- ఆమదాలవలస ఎక్సైజ్ స్టేషన్ పరిధి 42 గెజిట్ సీరియల్ నంబరును డ్రాలో విజేత దరఖాస్తుదారునిగా 6వ నంబర్ టోకెన్‌లో పేరున్న జయలక్ష్మిని అధికారులు మొదటిగా ప్రకటించారు. మళ్లీ అది 6 కాదని.. 9వ నంబర్ టోకెన్ అని పేరు వొమ్మి కృష్ణవేణి (టీడీపీ) అని చెప్పడంతో జయలక్ష్మి వర్గీయులు అవాక్కై వాగ్వాదానికి దిగారు.
- పొందూరు పరిధి 14వ నంబర్ టోకెన్‌దారు సారంగధరుడు తన పేరును అధికారులు మైక్‌లో అనౌన్స్ చేయలేదని, టోకెన్ స్టీలు డబ్బాలో వేయకపోయి ఉండవచ్చని అధికారుల వద్దకు రాగా అలాంటివేం ఇక్కడ జరగవంటూ పంపించేశారు.

● లిక్కర్ బిజినెస్‌లోకి దానేటి శ్రీధర్ ఫ్యామిలీ

అటు రాజకీయాల్లోనూ, ఇటు వైద్య రంగంలోనూ తనదైన పాత్ర పోషిస్తున్న జనసేన నాయకులు, ప్రముఖ వైద్యుడు దానేటి శ్రీధర్ లిక్కర్ బిజినెస్‌లో కూడా అడుగు పెట్టారు. ఆయన భార్య రాధారాణి చేసిన దరఖాస్తుకు దుకాణం దక్కింది. బూర్జ మండలంలోని 40వ నంబర్ గల దుకాణం లాటరీలో వరించింది.

● వాటాలిస్తారా.. లేదా..



కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం విధానంలో భాగంగా సోమవారం టెండర్లు ఖరారయ్యాయి. అధికారుల సమక్షంలో లాటరీ తీసి టెండర్లు ఖరారు చేశారు. జిల్లాలోని 158 దుకాణాలకు 4671 దరఖాస్తులు రాగా వాటిలో 158 మందిని లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు. లాటరీ వరకు ప్రశాంతంగా జరిగినా.. తర్వాతే అసలు సిసలైన అధికార బెదిరింపులు మొదలయ్యాయి. ఇప్పటికే సిండికేట్‌గా ఏర్పడి లాటరీలో తమ అనుయాయుల ద్వారా ఏకపక్షంగా దరఖాస్తులు చేయించి, అత్యధిక షాపులు దక్కించుకున్నారు. ఇవి చాలవన్నట్టు తమకు దక్కని చోట ఇతరులకు దక్కడాన్ని కూడా తట్టుకోలేకపోతున్నారు. వాటిని కూడా తమ గుప్పెట్లోకి తెచ్చుకునే కుట్రలు, కుతంత్రాలకు తెర లేపారు. సోమవారం మధ్యాహ్నం నుంచే దుకాణాలు దక్కించుకున్న 'ఇతరులకు' ఫోన్ చేసి సతాయించడం ప్రారంభించారు. ఏమిస్తావ్..ఏం చేస్తావ్...వాటాలు ఇస్తావా?...గుడ్‌విల్‌కు వదిలేస్తావా? అంటూ గదమాయించడం మొదలెట్టారు. కలిసి చేసుకుంటే ఫర్వాలేదు.. లేదంటే ఇబ్బందులే అని పరోక్ష హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ముఖ్యంగా టెక్కలి, పలాస డివిజన్ల పరిధిలో ఈ రకమైన బెదిరింపులు ఎక్కువయ్యాయి. ఇప్పటివరకు ఒక లెక్క దుకాణాలు ఏర్పాటు మరో లెక్క అని చెప్పకనే చెబుతున్నారు.

● నరసన్నపేటలో తమ్ముళ్ల గగ్గోలు



నరసన్నపేటలో చోటు చేసుకున్న పరిణామాలు తెలుగు తమ్ముళ్లను దహించి వేస్తున్నాయి. అన్నీ తానై చూసుకుంటానని చెప్పిన నేతలు చివరికి స్వార్థానికి పోవడంతో కంగుతిన్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కుటుంబీకులు ఏకంగా ఐదు దుకాణాలను దక్కించుకున్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోడలు బైరి మోహినికి 74 నంబర్ దుకాణం, మరదలి కుమారుడు ధర్మాన రామప్రసాద్‌కు 71,72 నంబర్లు గల దుకాణాలు దక్కగా, వియ్యంకుడు గుండ ఏలేశ్వరరావుకు 77,78 నంబర్ల దుకాణాలు వచ్చాయి. జరిగిన పరిణామాలను చూసి తెలుగు తమ్ముళ్లు జీర్ణించుకోలేకపోతున్నారు. మిగతా వ్యక్తులు దక్కించుకున్న దుకాణాల్లో చోటు కల్పిస్తానని కీలక నేతల నుంచి బుజ్జగిస్తున్నా వాటిలో కూడా పెద్దలదే పెత్తనం ఉంటుందని ఆవేదన చెందుతున్నారు.

● 'సోదరుడు' అనుచరులకే అత్యధిక దుకాణాలు

'సోదరుడు' అనుచరులు జిల్లా వ్యాప్తంగా దుకాణాలు దక్కించుకున్నారు. టెక్కలి నియోజకవర్గంలోనే కాదు నరసన్నపేట, శ్రీకాకుళం, పాతపట్నం, పలాస నియోజకవర్గాల్లో కూడా దుకాణాలను సాధించారు. మద్యం దుకాణాల్లో అధిక సంఖ్యలో దుకాణాలు దక్కించుకుని పట్టు సాధించారు. దుకాణాలు పొందిన వారిలో సదాశివుని రాంబాబు(120), సాహుకారి ఝాన్సీరాణి(122), మెండ మోహనరావు(123), అంధవరపు బాలరాజు(98), రత్నాల గణేష్ చౌదరి(99), కె.కె. రామయ్య(101,102), మండల రమణబాబు(104), జొంకాన మోహన్‌రావు(103),బొడ్డేపల్లి నాగవల్లి(116), పల్లి శ్రీనివాసరావు(115), బొంగు అప్పారావు(118), బొంగు దేవి(119), కూశెట్టి మోహనరావు(105), పైడిశెట్టి సంతోష్ కుమార్(109), బెండి అరుణ్‌కుమార్(110), పులి గణపతి(111), టి.వీరాంజనేయులు(112), కొట్టి మల్లేష్(114) ఉన్నారు.


● ఒడిశా వ్యాపారులకు ఫోన్ బెదిరింపులు



ఈసారి మద్యం దుకాణాల కోసం ఒడిశాకు చెందిన వారు కూడా అధిక సంఖ్యలో దరఖాస్తులు చేశారు. వారిలో కొందరికి దుకాణాలు దక్కాయి.

- కవిటి మండలంలోని 157 దుకాణాన్ని ఒడిశాకు చెందిన మనోరంజన్ బిసాయ్ దక్కించుకోగా, ఇచ్ఛాపురం మండలంలోని 154 దుకాణాన్ని ఒడిశాకు చెందిన కృష్ణచంద్ సాహూ దక్కించుకున్నారు.
- కొత్తూరు మండలంలోని 83 దుకాణాన్ని ఒడిశాకు చెందిన కె.రామస్వామి, 84వ నంబర్ గల దుకాణాన్ని లాడి అరుణ్‌కుమారి, పాతపట్నంలోని 90, 91, 92, 93 నంబర్లు గల దుకాణాలు ఒడిశాకు చెందిన కుమిలి రామస్వామి, రత్నాల పార్వతి, నెమలాపురి రాజ్‌కుమార్‌కు దక్కాయి.
- నందిగాం మండలంలోని 106 నంబర్ దుకాణం ఒడిశాకు చెందిన సురేష్ కుమార్ సాహుకారికి వచ్చింది.
- వీరిలో కొంతమందికి పాతపట్నం నియోజకవర్గ కీలక నేత అనుయాయులు ఫోన్ చేసి వాటిని తమకు వదిలేయండని బెదిరిస్తున్నారు. ఎంతో కొంత గుడ్‌విల్ ఇస్తామని, చెప్పినట్టు చేయకపోతే దుకాణాలు నడపలేరని వార్నింగ్‌లు కూడా ఇస్తున్నారు.
- ఇచ్ఛాపురం నియోజకవర్గ నేతలు కూడా ఇదేరకంగా ఫోన్‌లు చేసి సతాయిస్తున్నారు. మొత్తానికి ఒడిశా వ్యక్తులకు దక్కిన దుకాణాలన్నీ తమ చేతుల్లోకి వస్తాయన్నట్లు టీడీపీ నేతలు వ్యవహరిస్తున్నారు.

● అతివల పోటీ..



లిక్కర్ బిజినెస్‌లో నారీమణులు కూడా నడుం బిగించారు. మద్యం వ్యాపారంలో కూడా తమ వాటాను తీసుకున్నారు. జిల్లాలోని 158 దుకాణాల కోసం అధిక సంఖ్యలో దరఖాస్తులు చేశారు. లాటరీలో 24మందికి మద్యం దుకాణాలు వరించాయి. ఇందులో రాజకీయ నాయకులు, విద్యావంతులు, వ్యాపార వర్గాలకు చెందిన వారు ఉన్నారు. మద్యం బిజినెస్‌లో కూడా మహిళలు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. అనుకున్నట్టుగా దుకాణాలు సాధించుకున్నారు.

● మంత్రి అచ్చెన్న బంధువుకు మూడు దుకాణాలు

రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమీప బంధువు కింజరాపు పుష్పలత మూడు దుకాణాలను దక్కించుకున్నారు. నరసన్నపేట నియోజకవర్గం పోలాకిలోని 81 నంబర్ దుకాణం, జలుమూరులోని 121నంబర్ దుకాణంతో పాటు కోటబొమ్మాళిలోని 113 నంబర్ దుకాణం సాధించారు. ఈమె భర్త పేరు కూడా కింజరాపు అచ్చెన్నాయుడే. అడ్వకేట్‌గా కొనసాగుతున్నారు. లిక్కర్ బిజినెస్‌లో కూడా కింజరాపు ఫ్యామిలీ మార్క్ కనిపించింది.



ఇసుకపై హక్కు..

ఎవరిదో లక్కు



- నేడు ఆరు రీచ్‌ల టెండర్లు ఖరారు చేయనున్న మైన్స్ అధికారులు
- త్వరలో మరో ఆరు రీచ్‌లకు టెండర్ల ప్రక్రియ
- ఆఫ్‌లైన్ టెండర్లకు అధికార నేతల పట్టు

అరసవల్లి: జిల్లాలో మద్యం టెండర్లు ఖరారయ్యాయి. ఇక ఇసుక టెండర్లపై అందరి దృష్టి పడింది. ఇప్పటికే జిల్లాలో ఆరు రీచ్‌ల హక్కుల కోసం సీల్డు టెండర్ల ప్రక్రియను పూర్తి చేసిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ అధికారులు నేడు ఆ టెండర్ల బాక్సును ఓపెన్ చేయనున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో టెండర్ల ప్రక్రియను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావించినప్పటికీ...క్షేత్ర స్థాయిలో టీడీపీ కూటమి నేతలు మాత్రం ఆఫ్‌లైన్‌లో టెండర్లను దక్కించుకునేందుకు నానాయాగీ చేస్తున్నారు. ఇందుకోసం మైన్స్ కార్యాలయ అధికారులపై ఒత్తిళ్లకు దిగుతున్నారు. ఇసుక కోసం ఎందాకైనా అన్న చందంగా అధికార నేతలు జులుం ప్రదర్శిస్తుంటే అధికారులు మిన్నకుండిపోవాల్సి వస్తోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ పాలసీలో భాగంగా ఇసుక రీచ్‌ల హక్కుల కోసం పూర్తిగా ఆన్‌లైన్‌లో ప్రక్రియను పూర్తి చేయాలని, అలాంటి చర్యలకే అనుమతిస్తున్నట్లుగా అధికారులు ప్రకటిస్తున్నారు.

నేడు ఇసుక టెండర్ల ఖరారు

జిల్లాలో మొత్తం ఆరు చోట్ల ఇసుక రీచ్‌లను నిబంధనల మేరకు జిల్లా స్థాయి ఇసుక కమిటీ నిర్ణయించింది. బట్టేరు (శ్రీకాకుళం), హయాతినగర్ (శ్రీకాకుళం), బూరవల్లి (గార), అంబళ్లవలస (గార). గోపాలపెంట (నరసన్నపేట), నివగాం (కొత్తూరు) తదితర ఆరు రీచ్‌ల్లో ఇసుకను తోడ్కొని స్టాక్ పాయింట్ల వద్దకు తీసుకువచ్చేలా హక్కులకు గాను సీల్డు టెండర్ల ప్రక్రియను ఈ నెల 11వ తేదీతో పూర్తి చేసింది. ఈ మేరకు మొత్తం 38 బిడ్లు దాఖలయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రాష్ట్రంలో అన్ని చోట్ల ఈనెల 16లోగా టెండర్లు ఖరారు చేయాలని నిర్ణయించిన మేరకు జిల్లాలో మంగళవారం ఉదయానికి టెండర్ల బాక్సును తెరిచి అర్హులను ఖరారు చేయనున్నారు. అయితే కొత్తూరు మండలం నివగాం కోసం గట్టి పోటీ వచ్చినట్లుగా తెలుస్తోంది. తర్వాత స్థానంలో గార మండలంలోని రెండు రీచ్‌లకు దరఖాస్తులు అధికంగా పడ్డాయి. దాదాపుగా టీడీపీ అనుకూల నేతలకే టెండర్లు దక్కేలా వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. బేస్ ప్రైస్‌గా మెట్రిక్ టన్ను ఇసుక ధర రూ.110 గా నిర్ణయించడంతోనే టీడీపీ నేతలకు మాత్రమే పని కొచ్చేలా ప్రణాళిక చేసినట్టుగా స్పష్టమవుతోంది. ఇంత తక్కువ ధరకు ప్రతిపక్ష పార్టీలకు చెందిన లేదా తటస్థులెవరైనా టెండర్‌ను దక్కించుకున్నా ఇసుకను తోడుకుని వెళ్లడం అంత సులువు కాదన్నది వాస్తవం. దీంతో చాలా చోట్ల అధికార పార్టీకి చెందిన వారు మినహా మరెవ్వరూ టెండర్లలో పాల్గొనలేదని తెలుస్తోంది.

ఆన్‌లైన్‌లోనే టెండర్లు



ఇసుక హక్కుల కోసం ఈ మధ్యనే ఆరు రీచ్‌లకు సీల్డు టెండర్లు ఆహ్వానించాం. మంగళవారం ఖరారు చేస్తాం. అలాగే కొత్తగా మరో ఆరు రీచ్‌లను గుర్తించాం. వీటికి కూడా టెండర్లు వేయనున్నాం. టెండర్ల ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. ఇందులో ఎలాంటి మార్పు లేదు.

– సి.మోహనరావు, డిప్యూటీ డైరెక్టర్, మైన్స్

త్వరలో మరో ఆరు రీచ్‌లు

జిల్లాలో త్వరలోనే మరో ఆరు చోట్ల ఇసుక రీచ్‌లు అందుబాటులోకి రానున్నాయి. పురుషోత్తపురం –1, పురుషోత్తపురం–2 (నరుబుజ్జిలి), మందాడపేట (ఎచ్చెర్ల), పర్లాం (జలుమూరు), ముద్దాడపేట (ఆమదాలవలస), కిల్లిపాలెం (శ్రీకాకుళం)లలో రీచ్‌లు రానున్నాయి. వీటికి ఇప్పటికే పర్యావరణ అనుమతులు వచ్చేశాయి. దీంతో త్వరలో వీటి హక్కులకు గాను టెండర్లను ఆహ్వానించనున్నారు.

జాతరో.. జాతర..!



దర్శనానికి వేచి ఉన్న భక్తులు



అమ్మవారిని దర్శించుకున్న విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబసభ్యులు

- పైడితల్లి సంబరానికి శ్రీకారం
- సంప్రదాయబద్ధంగా ముగిసిన తొలేళ్లు
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు
- నేడు సిరిమానోత్సవం
- మధ్యాహ్నం 3 గంటల 5 నిమిషాలకు ముహూర్తం

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి జాతరకు తొలిఘట్టం తొలేళ్ల ఉత్సవంతో శ్రీకారం చుట్టారు. వేకువజామునుంచే అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజాదికాలు నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు కుటుంబ సమేతంగా ఉదయం 8.30 గంటలకు అమ్మవారిని దర్శించుకున్నారు. రాజవంశం ఆచారం ప్రకారం అమ్మవారికి కోటలో నుంచి పల్లకీలో అమ్మవారికి పసుపు, కుంకుమలు, పండ్లు, పట్టువస్త్రాలను తీసుకువచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులు ఆయనకు వేదాశీస్సులు అందజేశారు. ఆయనతో పాటు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మీగజపతిరాజులు ఉన్నారు.

ఘటాలతో నివేదన

అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం నగరంలోని పలువురు భక్తులు వివిధ వేషధారణలతో..డప్పు మోతలతో, ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. మహిళలు, పురుషులు సైతం అమ్మవారికి ప్రీతిపాత్రమైన..ఆమె ప్రతిరూపమైన ఘటాలను నెత్తిన పెట్టుకుని అమ్మవారికి నివేదించి తరించారు. తొలేళ్ల రోజున 25వేల మంది వచ్చినట్లు అంచనా.

క్లుప్తంగా

దుర్గమ్మకు అపురూప కానుక



తాను చిత్రించిన అమ్మవారి రూపంతో బెజవాడలో లాల్‌ప్రసాద్

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళానికి చెందిన యువ కళాకారుడు దాకోజు లాల్ ప్రసాద్ బెజవాడ కనకదుర్గ అమ్మవారి చిత్రాన్ని అత్యంత అపురూపంగా చిత్రించి సోమవారం ఆలయానికి సోమవారం అందజేశారు. ఆయన ముందుగా భవానీ మాలధారణ చేసుకుని ఇంటి వద్ద ఉండి నియమ నిష్టలతో అమ్మవారి చిత్రాన్ని తొమ్మిది రోజులు శ్రమించి చిత్రించారు. ఆయనను డీఎస్పీ హేమలత, అక్కడి అధికారులు, అర్చకులు అభినందించారు.

కుస్తీ పోటీల్లో వెండి పతకం



భాస్కరరావును అభినందిస్తున్న దుర్గాప్రసాద్, మోహనరావు

నరసన్నపేట: స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి నర్సిపురం భాస్కర రావు రెజ్లింగ్ (కుస్తీ) విభాగంలో రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో వెండి పతకం సాధించాడు. విజయవాడలో నిర్వహించిన 68వ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో రెండో స్థానం లభించింది. ఈ మేరకు కళాశాల డైరెక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. పోలాకి మండలం వనవిష్ణుపురానికి చెందిన భాస్కర రావును కళాశాల యాజమాన్యం అభినందించింది. జిల్లా పేరును నిలిపినందుకు ప్రత్యేకంగా కళాశాల ప్రిన్సిపల్ మనలినాయుడు, ఏటీ మెండ మోహనరావు సత్కరించారు.

శిలాఫలకంపై ప్రొటోకాల్ ఉల్లంఘన



పెద్దలోగిడిలో సర్పంచ్, ఎంపీటీసీ పేర్లు లేకుండా ఏర్పాటు చేసిన శిలాఫలకం

పాతపట్నం: మండలంలోని పెద్దలోగిడి, పేడూరు, బొమ్మిక గ్రామాల్లో పల్లెపండగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సోమవారం శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన బోర్డులో స్థానిక సర్పంచ్‌ల పేర్లు, ఎంపీటీసీ పేర్లు లేకుండా టీడీపీ నాయకుల పేర్లు ఉండడం గమనార్హం. ప్రొటోకాల్ పాటించకుండా అధికారులు బోర్డులు ఏర్పాటు చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ వారోత్సవాల్లో పంచాయతీ సర్పంచ్‌లకు ప్రాధాన్యత లేకుండా శంకుస్థాపనలు చేస్తున్నారని ప్రజలు అంటున్నారు.

ప్రజల నుంచి వినతుల స్వీకరణ

కోటబొమ్మాళి: తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరించేందుకు కృషి చేస్తానని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో మంత్రి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వాటి పరిష్కారం కోసం అర్జీలను సంబంధిత అధికారులకు అందజేశారు. ప్రతి సమస్యనూ పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

అల్పపీడనం నేపథ్యంలో హెల్ప్‌డెస్కుల ఏర్పాటు

అరసవల్లి: బంగాళాఖాతంలో రానున్న ఐదు రోజుల్లో అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో భారీ వర్షాలు, తీవ్ర గాలులు వీచే అవకాశాలు ఉన్నాయని వాతావరణ నిపుణులు హెచ్చరించిన నేపథ్యంలో జిల్లాలో విద్యుత్ అంతరాయాలు లేకుండా డివిజన్ కేంద్రాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసినట్లుగా విద్యుత్ శాఖ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలియజేశారు. విద్యుత్ పరంగా జిల్లా వాసులకు ఎక్కడ ఇబ్బందులు లేకుండా ఉండేలా శ్రీకాకుళం సర్కిల్ కార్యాలయంలో ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ కాంటాక్ట్ నంబర్– 9490612633తో పాటు శ్రీకాకుళం డివిజన్ – 9490610045, టెక్కలి – 8332843546, పలాస – 73825 85630 హెల్ప్ డెస్కులు పనిచేస్తాయని ఆయన ప్రకటించారు. అలాగే విద్యుత్ వినియోగదారులు తగు భద్రతాచర్యలు సూచనలు పాటించాలని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలెదురైతే..హెల్ప్ డెస్కులను సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

మృత్యు కాలువ



రాజపురం వద్ద ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకుండా దర్శనమిస్తున్న ఆఫ్‌షోర్ కాలువ

- మనుషులను మింగేస్తున్న ఆఫ్‌షోర్ కాలువ
- తవ్విన నాటి నుంచి లెక్కకు మిక్కిలి ప్రమాదాలు
- కానరాని ప్రమాద హెచ్చరిక బోర్డులు

మెళియాపుట్టి: ఆఫ్‌షోర్ కాలువ ప్రమాదాలకు చిరునామాగా మారుతోంది. యాభై అడుగుల లోతున్న ఈ కాలువలో ఎప్పటికప్పుడు ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు నియంత్రణ చర్యలు తీసుకోవడం లేదు. రేగులపాడు రిజర్వాయర్‌కు అనుసంధానంలో భాగంగా మండలంలోని పట్టుపురం, జోడూరు, రాజపురం, అచ్చనాపురం తదితర గ్రామాలకు ఆనుకుని ఆఫ్‌షోర్ కాలువను 2008–09లో తవ్వారు. సుమారు 50 అడుగుల లోతున్న ఈ కాలువ మృత్యుకాలువగా మారింది. కాలువలో స్నానాలకు దిగి ఈతరాక ఎంతోమంది మృతిచెందిన సంఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదు. ఇప్పటికీ కాలువ చుట్టు పక్కల ఎక్కడా హెచ్చరిక బోర్డులే కనిపించడం లేదు.

ఎన్నో ప్రమాదాలు..

- 2018లో చిన్ననీలాపురం గ్రామానికి చెందిన కొల్లి తారకేశ్వరరావు కాలువలో స్నానానికి దిగి మృతి చెందాడు. మూడురోజుల తర్వాత మృతదేహం లభ్యమైంది.
- 2019 మే 10వతేదీన మారడికోట గ్రామానికి గ్రామదేవత ఉత్సవాలకు తన స్నేహితుని ఇంటికి వచ్చిన హైదరాబాద్ యువకుడు మొహద్దీన్ ఈత సరదాతో కాలువలో దిగి మృత్యువాత పడ్డాడు.
- 2019 డిసెంబర్ 28న ఓగుర్తుతెలియని మహిళ మృతదేహం జోడూరు వద్ద కాలువలో లభించింది.
- ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు స్పందించడం లేదు. నిత్యం కాలువలో నీరు ఉండటంతో యువకులు స్నానాలకు వెళుతున్నారని, ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కాలువ నా భర్త ప్రాణాలు తీసింది



2018లో నా భర్త తారకేశ్వరరావు ఆఫ్‌షోర్ కాలువకు స్నానానికి వెళ్లి గల్లంతై చనిపోయాడు. నా కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. నా పరిస్థితి ఇంకెవరికీ రాకూడదు. అధికారులు స్పందించి ఏవైనా సూచికలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– కొల్లి గుణలక్ష్మి, చిన్న నీలాపురం గ్రామం, మెళియాపుట్టి మండలం

ఈత సరదా ప్రాణాలు తీస్తుంది



చాలామంది కాలువలో ఈత కోసం వస్తూ ప్రాణాలు కోల్పోతున్నారు. కాలువ ఎంత లోతుందో తెలియక స్నానాలకు దిగుతున్నారు. గ్రామాలకు ఆనుకుని ఉండటంతో వేసవిలో అయితే యువకులు అక్కడే కాలక్షేపం చేస్తున్నారు. ఏ మాత్రం కాలు జారినా ప్రాణాలు దక్కవు. అధికారులు పట్టించుకోవాలి.

– సవర సూరయ్య, అచ్చనాపురం గ్రామం, మెళియాపుట్టి మండలం

త్వరలోనే ఏర్పాటు చేస్తాం



పనులు ఇంకా పూర్తి కాక పోవడంతో.. కాలువ లోతు నిర్ధారించలేం గనక కొన్నిచోట్ల ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. త్వరలోనే ఏర్పాటు చేస్తాం. మేం గ్రామాల్లో పర్యటించిన సమయాలలో సైతం అప్రమత్తం చేస్తున్నాం. ఇంక ప్రమాదాలు జరకుండా చర్యలు తీసుకుంటాం.

– రాజశేఖర్, టెక్కలి వంశధార ఈఈ

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న పీడీఎస్ లోడుతో ఉన్న లారీ ముందు అధికారులు

కొత్తూరు: మండల కేంద్రంలోని నివగాం రోడ్డులో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఓ లారీలో ఉన్న రూ.14,72,607 విలువ చేసే 32,365 కిలోల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. శ్రీకాకుళం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బర్ల ప్రసాదరావుకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు.

పట్టుకొన్న పీడీఎస్ బియ్యం కొత్తూరు చెందిన తంగుడు శివశంకర్‌వని అధికారులు తెలిపారు. శివశంకర్‌కు చెందిన కర్లెమ్మ సమీపంలో ఉన్న రైస్ మిల్లు వద్ద తనిఖీలు నిర్వహించగా 20 బస్తాలు రైస్ (50కిలోలు) బ్రోకెన్ రైస్ 6 బస్తాలు, డిస్‌కలర్ రైస్ 20 బ్యాగ్‌లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పట్టుకొన్న రైస్‌ను సీజ్ చేయడంతో పాటు అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ భీమారావు చెప్పారు. ఇక్కడి నుంచి బియ్యం ఒడిశా మీదుగా పారాదీప్ ఓడరేవుకు వెళ్తున్నట్లు సమాచారం.

బాలింతలే టార్గెట్

కొత్తూరు: బాలింతలను టార్గెట్‌గా పెట్టుకుని హెల్త్ డిపార్ట్‌మెంట్ పేరు చెప్పి మోసం చేస్తున్న వైనం వెలుగులోకి వచ్చింది. అంగన్‌వాడీల ద్వారా బాలింతల వివరాలు సేకరించి వారి బ్యాంకు ఖాతాల నుంచి నగదు తస్కరిస్తున్నారు. హెల్త్ డిపార్టుమెంట్ అని చెప్పి 81718 72148, 99487 22258 ఫోన్ నంబర్లతో అంగన్‌వాడీ కార్యకర్తలకు కొందరు ఫోన్లు చేశారు. జూన్ నుంచి ఇంతవరకు డెలివరీ అయిన బాలింతల వివరాలతో పాటు ఫోన్ నంబర్లు ఇవ్వాలని సోమవారం ఫోన్‌లు చేశారు. బాలింతలకు ప్రభుత్వం ఇవ్వాల్సిన మొత్తాన్ని ఖాతాలకు జమ చేస్తామని ఫోన్ ద్వారా చెప్పారు. వారి మాటలు నమ్మేసిన కార్యకర్తలు ఫోన్ నంబర్లు ఇవ్వడంతో.. వారు అందరికీ కాల్స్ చేయడం మొదలుపెట్టారు. మీకు ప్రభుత్వం డెలివరీ ఖర్చుల కింద డబ్బులు మీ ఖాతాలకు వేస్తోందని చెప్పి ఖాతా నంబర్లు అడిగి తీసుకున్నారు. కొత్తూరులో ఒకరు ఖాతా నంబర్ ఇవ్వడంతో రూ. 9వేలు తస్కరించినట్లు తెలిసింది. ఈ విషయం అంగన్ కార్యకర్తలకు తెలియడంతో వెంటనే బాలింతలందరికీ ఫోన్ చేసి ఎవరికీ బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వద్దని సూచించారు.

ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు



టెక్కలి అయ్యప్పనగర్ రోడ్డుకు శంకు స్థాపన చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలిలో అయ్యప్పనగర్, మండాపొలం కాలనీతో పాటు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సుమారు రూ.4 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఆయన సోమవారం శంకుస్థాపనలు చేశారు. ప్రజల అవసరాల మేరకు రోడ్లు, మురుగు కాలువలను నిర్మిస్తామన్నారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. టెక్కలిలో టీటీడీ కల్యాణ మండపం కోసం స్థలం గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, తహసీల్దార్ దిలీప్‌చక్రవర్తి, ఎంపీపీ ఎ.సరోజనమ్మ, వంశధార ఈఈ శేఖర్, టీడీపీ నాయకులు కె.హరివరప్రసాద్, బి.శేషగిరి, మాజీ ఎంపీపీ ఎం.సుందరమ్మ, కే.లవకుమార్, ఎం.రాము, కె.కామేష్, డి.ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిట



బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



టికెట్ కౌంటర్ వద్ద క్యూ

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ సోమవారం కూడా ప్రయాణికులతో రద్దీగా కనిపించింది. దసరా పండగ సందర్భంగా దూరప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు తిరుగుప్రయాణం కావడంతో కాంప్లెక్స్ కిటకిటలాడింది. ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండడంతో ఆర్టీసీ అధికారులు తగు చర్యలు తీసుకుని రద్దీకి తగ్గట్లుగా చార్జీలు పెంచకుండానే పల్లెవెలుగు బస్సులను నాన్‌స్టాప్ బస్సులుగా నడిపారు. దీంతో ఏదో ఒక బస్సు, సీటు దొరికితే చాలు అనుకుని ప్రయాణికులు పల్లెవెలుగు బస్సులను ఎక్కారు.

పాలఖండ్యాం జూట్‌మిల్లులో కార్మికుడు మృతి



కార్మికుడి మృతదేహం

జి.సిగడాం: పాలఖండ్యాం గ్రామ సమీపంలో సీతా రామ లక్ష్మీ జూట్‌మిల్లులో కార్మికుడిగా పనిచేస్తున్న సత్యేంద్ర సింగ్ మిల్లులోనే మృతి చెందారు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు.. సత్యేంద్ర ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి. ఈయన 2 నెలల క్రితం ఫ్యాక్టరీలో జీవనోపాధి కోసం చేశారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో డ్యూటీ దిగి భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటూ చనిపోయారు. యాజమాన్యం సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. మృతదేహాన్ని రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబానికి సమాచారం అందించామని తెలిపారు.

అనుమానాస్పదంగా వివాహిత మృతి

సంతబొమ్మాళి: మండలం తెనిగిపెంట గ్రామానికి చెందిన వివాహిత పెంట రేవతి (19) మృతి చెందడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి సంతబొమ్మాళి ఎస్ఐ జి.నారాయణస్వామి సోమవారం తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రేవతికి అదే గ్రామానికి చెందిన పెంట లక్ష్మయ్యతో గత ఏడాది వివాహం జరిగింది. ఈ నెల నాలుగో తేదీన రేవతి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ నెల ఆరో తేదీన గ్రామంలోని పాఠశాల సమీపంలో బావిలో ఆమె మృతదేహం బయటపడింది. అదే రోజు దహన సంస్కారాలు కూడా చేశారు. మృతిపై వివాహిత కుటుంబ సభ్యులకు అనుమానాలు రావడంతో పోలీసులను ఆశ్రయించారు. మృతురాలు తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అయితే మృతురాలు ఆత్మహత్య చేసుకుందా లేక హత్య చేశారా అన్నది తేలాల్సి ఉంది. పోస్టుమార్టం రిపోర్టు ప్రకారం ఏం జరిగిందో నిర్ధారిస్తామని పోలీసులు తెలిపారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని దీనిపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నారాయణస్వామి తెలిపారు.

కాలువలో పడి వృద్ధురాలు మృతి

టెక్కలి రూరల్: మండలంలోని రావివలస గ్రామానికి చెందిన పైల కరువమ్మ(58) అనే వృద్ధురాలు కాలువలో పడి మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. కరువమ్మ మూడు రోజుల కిందట బహిర్భూమి కోసం కాలువ వద్దకు వెళ్లి అందులో పడిపోయింది. మూడు రోజులుగా ఆమె కనిపించకపోవడంతో బంధువుల ఇంటికి వెళ్లి ఉంటుందని కుటుంబ సభ్యులు అనుకున్నారు. అయితే సోమవారం గ్రామంలో కాలువ సమీపంలో వెళ్తున్న వారికి దుర్వాసన రావడంతో అక్కడ చూడగా మృత దేహం కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతురాలికి భర్త, పిల్లలు ఎవరూ లేకపోవడంతో వారి మేనల్లుడు గ్రామస్తుల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు.

గడ్డి మందు తాగిన మహిళ మృతి



మృతిచెందిన భార్యాభర్తలు, చంటి, భవానీ (ఫైల్)

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని కేశవరాయునిపాలేం గ్రామానికి చెందిన నాయన భవానీ (20) గడ్డి మందు తాగేసిన సంగతి తెలిసిందే. ఈమె భర్త నాయని చంటి శనివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. భర్త మరణంతో కుంగిపోయిన ఆమె ఆదివారం ఉదయం గడ్డి మందు తాగేయడంతో రిమ్స్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో మృతి చెందారు. లావేరు హెచ్‌సీ పి.రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన గురునాథ్

ఎల్.ఎన్.పేట: మండలంలోని రావిచంద్రి సమీపంలో అలికాం–బత్తిలి (ఏబీ) రోడ్డుపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలియజేసిన వివరాలు ప్రకారం.. సారవకోట మండలం గోపాలపురం గ్రామానికి చెందిన తర్ర గురునాథ్ ఎల్.ఎన్.పేట మండలం చిన్నకొల్లివలస వంశధార పునరావాస కాలనీలోని అత్తవారి ఇంటికి తన ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఎల్.ఎస్.పేట సెంటర్ వైపు వస్తున్న గురునాథ్ కొత్తూరు నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్‌ను ఢీకొట్టాడు. దీంతో అతని తలకు బలమైన గాయాలయ్యాయి. బస్‌లో ప్రయాణికులు, స్థానికులు గాయపడిన వ్యక్తిని 108 అంబులెన్స్ ద్వారా శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

సరికొత్త పంథాలో ఇంటర్ పరీక్షలు

- నేటి నుంచి ఇంటర్ త్రైమాసిక పరీక్షలు
- రాష్ట్రవ్యాప్తంగా ఒకే ప్రశ్న పత్రంతో పరీక్షలు రాయనున్న విద్యార్థులు
- పరీక్షకు గంట ముందు ప్రశ్న పత్రాల డౌన్‌లోడ్



పరీక్షలకు సన్నద్ధమవుతున్న సెకెండియర్ ఇంటర్ విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం కొత్త పంథాలో పరీక్షలు నిర్వహించనుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే ప్రశ్న పత్రంతో విద్యార్థులు పరీక్షలు రాసేలా నిర్ణయించింది. మంగళవారం నుంచి మొదలుకానున్న త్రైమాసిక(క్వార్టర్లీ) పరీక్షలతో ఈ విధానం అమల్లోకి రానుంది.

50 మార్కులకు ప్రశ్న పత్రం..

రాష్ట్రవ్యాప్తంగా ఒకే ప్రశ్న పత్రంతో పరీక్షలు రాయనున్న నేపథ్యంలో నిర్దేశించిన సిలబస్‌లను పూర్తిచేయడం లెక్చరర్లకు కత్తిమీద సాములా తయారైంది. వరుసగా సెలవులు, తుఫాను సెలవులు, అడ్మిషన్ల ప్రక్రియను ఆగస్టు నెల వరకు చేపట్టడం వంటి కారణాలతో మెజారిటీ కాలేజీల్లో సిలబస్‌లు పూర్తికాలేదు. దీంతో విద్యార్థులకు కొన్ని ముఖ్యమైన ప్రశ్నలను తెలియజేసి నేర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రశ్న పత్రం ఏవిధంగా ఉంటుందోనని తలలు పట్టుకుంటున్నారు. క్వార్టర్లీ పరీక్షలను ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించనున్నారు. జిల్లా ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ శివ్వాల తవిటినాయుడు నేతృత్వంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టారు. ప్రిన్సిపాళ్లతో పలు దఫాలుగా సమీక్షించారు.

గంట ముందు ప్రశ్న పత్రం..

పరీక్షకు గంట ముందు ప్రశ్న పత్రాన్ని జ్ఞానభూమి లాగిన్ ఇంటర్‌బోర్డు వెబ్‌పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతారు. కాలేజ్ లాగిన్‌లో ప్రశ్న పత్రం ప్రిన్సిపాల్‌కు చేరుతుంది. ఐడీ, పాస్‌వర్డు ద్వారా క్వశ్చన్ పేపర్ డౌన్‌లోడ్ చేసుకుని ప్రింటౌట్స్ తీసి, కళాశాలల్లో నిర్దిష్టమైన సమయానికి విద్యార్థులకు అందజేసి పరీక్షలను రాయిస్తారు. విద్యార్థులకు వచ్చిన మార్కులను ఐదు రోజుల్లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

అనంతరం తల్లిదండ్రులతో సమావేశ పరిచి వారి పిల్లల ప్రగతి, చదువు తీరును తెలియజేసేలా కసరత్తులు చేస్తున్నారు.

హెల్త్ సెక్రటరీల ఆందోళన



డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న హెల్త్ సెక్రటరీలు

అరసవల్లి: జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే హెల్త్ సెక్రటరీల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ఏపీ యునైటెడ్ విలేజ్, వార్డు హెల్త్ సెక్రటరీల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సోమవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద హెల్త్ సెక్రటరీలంతా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరికి మద్దతు పలికిన సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి తేజేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో వైద్య సేవలందిస్తున్న కార్యదర్శులపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని, ఇది తగదన్నారు.

కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.మురళి, హెల్త్ సెక్రటరీల సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.సాయిప్రసాద్, వై.ప్రభావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం డీఎంహెచ్‌ఓ డాక్టర్ మీనాక్షికి, జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్యకు హెల్త్ సెక్రటరీలంతా వినతిపత్రాన్ని సమర్పించారు.

18.840 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులతో మీడియా సమావేశం

పాతపట్నం: అక్రమంగా గంజాయి తరలిస్తున్న తమిళనాడు(చెన్నై)కు చెందిన అజయ్ కృష్ణమూర్తి(24), క్రితీష్ కుమార్(21) అనే ఇద్దరు యువకులను సోమవారం పాతపట్నం పోలీసులు అరెస్టు చేశారు. పాతపట్నం అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నడుచుకుంటూ వస్తున్న వీరిద్దరి నుంచి 18.840 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సాయంత్రం పాతపట్నం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. అడిషనల్ ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నైకు చెందిన అజయ్ కృష్ణమూర్తి, క్రితేష్ కుమార్‌లు చెన్నైకు తరలించేందుకు 18.840 కిలోల గంజాయిని 9 ప్యాకెట్లు రెండు బ్యాగ్‌లుగా తయారు చేసి ఒడిశా నుంచి పాతపట్నం చెక్‌పోస్టుకు నడుచుకుంటూ వస్తున్నారు. వీరిని గమనించిన పోలీసులు ఇద్దరిని పట్టుకున్నారు. గంజాయి ఒడిశా నుంచి చెన్నైకు తరలించడానికి ఒక్కొక్కరు రూ.పది వేలు చొప్పున తీసుకోవడానికి చెన్నైకు చెందిన దినేష్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందంలో భాగంగా ఒడిశా గుణుపూర్ బ్లాక్ వెల్లి గౌతమ్ వద్ద నుంచి 18.840 గంజాయి తీసుకు వస్తుండగా పాతపట్నం పోలీసులకు పట్టుబడ్డారు. ఒడిశా నుంచి పాతపట్నం మీదుగా విశాఖపట్నం అక్కడ నుంచి చెన్నై తరలించే ప్రయత్నంలో పట్టుబడ్డారు. గంజాయి ముఠాను పట్టుకోవడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన పాతపట్నం సీఐ, ఎస్ఐను ఏఎస్పీ అభినందించారు. మీడియా సమావేశంలో పాతపట్నం సీఐ వి.రామారావు, ఎస్ఐ బి.లావణ్య పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



గోరిశెట్టి శంకరరావు మృతదేహం

పాతపట్నం: పాతపట్నం బాలాజీ నగర్–3కు చెందిన గోరిశెట్టి శంకర రావు(40) సోమవారం ఉదయం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర రావు అమ్మవారి ఆలయం వద్ద ఏటలు వేసుకుని జీవిస్తుంటాడు. సోమవారం ఉదయం గోరిశెట్టి శంకర్ మందు తాగి ఇంటికి రావడంతో భార్య గోరిశెట్టి రాజేశ్వరి మందు తాగవద్దని మందలించారు. దీంతో ఆయన మనస్తాపం చెంది రత్నాల పేటలో ఉన్న పాత ఇంటికి వెళ్లి తువ్వాలతో ఉరివేసుకున్నాడు. ఎంతకూ ఆయన ఇంటికి రాకపోవడంతో శంకరరావు పెద్ద కుమారుడు పవన్ ప్రసాద్, బావమరిది మధు రత్నాలపేట ఇంటికి వెళ్లి చూడగా శంకరరావు ఉరికి వేలాడుతూ కనిపించారు. దీంతో వారు రాజేశ్వరికి సమాచారం ఇచ్చారు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని పాతపట్నం సీహెచ్‌సీ ఆస్పత్రికు తరలించి, పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.